ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
శనివారం 11 జనవరి 2025





ముక్కోటి శోభ

● వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు ● కిటకిటలాడిన ఆలయాలు ● భక్తులకు ఉత్తర ద్వార దర్శనం

నంద్యాల కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. గురువారం రాత్రి నుంచి పలు వైష్ణవాలయాలకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఆలయాలను తెరిచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. వైకుంఠ ఏకాదశి రోజున విష్ణుమూర్తిని దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో శుక్రవారం భక్తులు వేలాదిగా వైష్ణవాలయాలకు తరలివచ్చారు. అలంకార ప్రియుడైన విష్ణుమూర్తిని, లక్ష్మీ దేవి, గోదాదేవి అమ్మవార్ల మూల మూర్తులను, ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. ఆలయాలకు విభిన్న రంగుల్లోని పుష్పాలతో తోరణాలతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా అన్ని ఆలయాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి.



సంజీవనగర్ రామాలయంలో యాలకులు,సాంప్రదాయ వస్తువులచే ప్రత్యేక విశేష అలంకారంలో వెంకటేశ్వరస్వామి



సంజీవనగర్ రామాలయంలో క్యూలైన్లలో భక్తులు



బాలాజీకాంప్లెక్స్ కళ్యాణమండపంలో లక్షతులసీ అర్చనలో పాల్గొన్న భక్తులు

బాలాజీకాంప్లెక్స్ కళ్యాణమండపంలో మొక్కజొన్న విత్తనాలచే స్వామివారికి ప్రత్యేక అలంకారం

శ్రీశైలంలో విశేష పూజాదికాలు



పుష్పాలంకరణలో స్వామి అమ్మవార్లు

శ్రీశైలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకను దేవస్థానం వైభవంగా నిర్వహించింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజాదికాలు, రావణ వాహనసేవ గ్రామోత్సవం జరిపారు. శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి మంగళ వాయిద్యాలు, స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించి తరువాత స్వామి, అమ్మవార్లకు ప్రాతఃకాల పూజలు జరిపించి 4.30 గంటలకు స్వామివారికి, తరువాత అమ్మవారికి మహామంగళహారతులు నిర్వహించారు. అనంతరం ఉత్సవంలో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను స్వామివారి ముఖ మండపంలో ఉత్తర ముఖంగా ఆశీనులను చేసి విశేషపూజాదికాలు జరిపారు. ఆలయ ఉత్తర భాగంలో రావణవాహనంపై ఆశీనులనుజేసి ఉత్తర ద్వారమైన శివాజీ గోపురం ఉంచి వెలుపలకి తీసుకు వచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం ప్రారంభమైన తరువాత నుంచి భక్తులకు దర్శనానికి అనుమతించారు. ఉత్సవ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

గరుడ వాహనంపై అహోబిల నారసింహుడు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎగువ, దిగువ అహోబిలంలోని శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాద వరద స్వామికి తెల్లవారుజామునే అర్చకులు పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఉత్తర ముఖ ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకిలో గరుడ వాహనంపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్, ఆలయ మేనేజర్ మురళీధరన్ పాల్గొన్నారు.



అహోబిలంలో ఉత్సవమూర్తులకు పూజలు



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

భూ సమస్యలకు పరిష్కారం చూపండి

కలెక్టర్ రాజకుమారి



రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భూ రికార్డుల్లో మ్యుటేషన్ల దిద్దుబాటు, రెవెన్యూ సదస్సుల్లో భూ పరిష్కార నిమిత్తం స్వీకరించిన దరఖాస్తులు క్షేత్ర స్థాయిలో నిశితంగా పరిశీలించి నిర్దేశిత కాలపరిమితి లోగా పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ రాజకుమారి మండల తహసీల్దార్లను, ఆర్డీవోలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో భూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి రికార్డులలో మ్యుటేషన్ల దిద్దుబాటు కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను కూడా పరిశీలించి త్వరతగతిన పరిష్కరించాలని అన్నారు. ఆళ్లగడ్డ, బండిఆత్మకూరు, పాములపాడు, నందికొట్కూరు, నంద్యాల అర్బన్, రూరల్, పాణ్యం, పగిడ్యాల, తదితర మండలాల్లో, వీఆర్‌ఓ, తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ ట్రాన్స్‌యాక్షన్ దరఖాస్తులను క్లియర్ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు 45 రోజుల్లో రీసర్వే నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులకు కౌంటర్ వేయడంతోపాటు కోర్టు మధ్యంతర, తుది ఉత్తర్వులను కచ్చితంగా అమలు పరచాలన్నారు. పరిశ్రమలు, సాగు నీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో పైలెట్ ప్రాతిపదికన గ్రామాన్ని ఎంపిక చేసుకొని గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూమి సరిహద్దులు గుర్తించి రీసర్వే పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సభ నిర్వహించే రోజు గ్రామస్తులందరికీ తెలిసేలా ముందుగానే దండోరా వేయించి విస్తృత ప్రచారం చేయాలన్నారు.

శ్రీగిరిపై సంక్రాంతి వేడుకలు



సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీశైలం ఆలయం

శ్రీశైలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. 11వ తేదీ శనివారం ఉదయం 8.45 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 12వ తేదీన భృంగి వాహన సేవ, 13న కైలాస సేవ, 14న మకర సంక్రాంతి పర్వదినం రోజున నంది వాహనసేవ, కల్యాణోత్సవం, 15న రావణ వాహనసేవ, 16న యాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూల స్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాలు, 17న రాత్రి అశ్వ వాహనసేవ, శయనోత్సవం, ఏకాంత సేవలతో ఉత్సవాలు ముగుస్తాయి.

28న విజయ డెయిరీ బోర్డు సమావేశం

మూడు స్థానాలకు ఎన్నికలు

నంద్యాల, జనవరి 10, (ఆంధ్రజ్యోతి) : విజయ డెయిరీ నంద్యాల బోర్డు సమావేశం ఈనెల 28న జరుగుతుందని ఎన్నికల అధికారి హరిబాబు శుక్రవారం ప్రకటనలో తెలియజేశారు. నంద్యాల పాలకవర్గ సభ్యులు రోటేషన్ పద్ధతిలో ప్రతి ఏడాది ముగ్గురు చొప్పున యూనియన్ నిబంధనలు ప్రకారం ఈనెల 31వ తేదీన ముగ్గురు డైరెక్టర్లు పదవీ విరమణ చేయనున్నారని తెలియజేశారు. ఈ స్థానాలను భర్తీ చేయడానికి ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పాణ్యం మండలం నెరవాడ మాక్స్ డైరెక్టర్ సరళమ్మ, సంజామల మండలం గిద్దలూరు-బి మాక్స్ డైరెక్టర్ కామిరెడ్డి చెన్నారెడ్డి, శిరివెళ్ల మండలం గంగవరం మాక్స్ డైరెక్టర్ ఉడత రమణ పదవీ విరమణ చేయనున్నారు. ఈ ఖాళీలను ఎన్నికల ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ నెల 17వ తేదీన 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ స్వీకరణ, ఆ తర్వాత అదే రోజున 3 గంటల నుంచి పరిశీలన, 18న ఉపసంహరణ, 27వ తేదీన పోలింగ్ జరుగుతాయని ఆయన తెలియజేశారు.



● ఉమ్మడి జిల్లాలో జోరుగా అక్రమ రవాణా
● జీరో వ్యాపారంతో ఖజానాకు గండి
● నిఘా అధికారుల కళ్లకు గంతలు
● దొరికితేనే దొంగలు.. లేదంటే దొరలే

దొంగ బంగారం

బంగారాన్ని అక్రమ మార్గాల్లో విక్రయించేవారు పెరిగిపోయారు. కొందరు ప్రభుత్వానికి సుంకం చెల్లించకుండా జీరో వ్యాపారం ద్వారా ప్రభుత్వ ఖనాజాకు గండి కొడుతున్నారు. కర్నూలు శివారులో పంచలింగాల చెక్‌పోస్టు దాటుకొని రూ.కోట్ల విలువైన బంగారం హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, నగరాలకు తరలిపోతోంది. దొరికితేనే దొంగలు.. లేదంటే దొరలే. కేరళ రాష్ట్రం ఎర్నాకులం నుంచి ఆదోని పట్టణానికి రూ.10 కోట్లకు పైగా విలువైన 13 కిలోల బంగారు ఓ రైలులో అక్రమ రవాణా చేస్తూ సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన బంగారం అక్రమ రవాణా ఏ స్థాయిలో ఉందో బట్టబయలు చేసింది. ఈ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.




కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదోని, కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో బంగారు వ్యాపారం జరుగుతోంది. ఇందులో ముప్పాతిక వంతు ఆదోని, కర్నూలు నగరంలోనే జరుగుతోంది. ఆదోని పట్టణంలో 250 మంది, కర్నూలు నగరంలో 250-300 మంది వరకు బంగారులు వ్యాపారులు ఉన్నా.. ప్రభుత్వం నుంచి లైసెన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్నవారే అధికం. ఉమ్మడి కర్నూలులో దాదాపుగా 850 మందికిపైగా బడా, చోటా వ్యాపారులు ఉన్నారని ఓ బంగారు వ్యాపారి తెలిపారు. ఒక్కో వ్యాపారి సగటున రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు బంగారు వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ లెక్కన ఎంత తక్కువ కాదన్నా ఏడాదికి రూ.750 కోట్లకు పైగా బంగారు క్రయ విక్రయాల లావాదేవిలు జరుగుతున్నాయని అంటున్నారు. పాత బంగారం విక్రయించినా.. కొత్త బంగారం కొనుగోలు చేసినా తరుగు, మేకింగ్ చార్జీలు వసూలు చేస్తారు. లాభం సరేసరి. ఏటా రూ.కోట్ల లావాదేవీలు జరగుతుండడంతో జీఎస్టీ లెక్కలు చూపించలేక జీరో దందాకు తెర తీశారు. తద్వారా బంగారం అక్రమ రవాణా ఉధృతమైంది.

● జోరుగా జీరో దందా..!

రత్నాలు, బంగారు ఆభరణాలు తయారీ, విక్రయాల రంగంలో దేశంలో సుమారుగా 50 లక్షల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. ఎగుమతుల్లో ఈ రంగం వాటా 8 శాతం. పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్రం (సీబీఐసీ) ఛైర్మన్ సంజయ్ కుమార్ మలోహత్రా గత ఏడాది జూలైలో జరిగిన ఓ సమావేశంలో వెల్లడించారు. ఈ రంగంపై ఆధారపడి ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దాదాపుగా 4,500 నుంచి 5 వేల మందికిపైగా ఉపాధి పొందుతున్నట్లు తెలుస్తోంది. ఉపాధి అవకాశాలు ఏ స్థాయిలో ఉన్నాయో.. అదే స్థాయిలో అక్రమ రవాణా, జీరో దందా కూడా సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ రాష్ట్రం నుంచి మరో రాష్ట్రంలోని పట్టణం, నగరాలకు ముడి బంగారు బిస్కెట్లు (24 క్యారెట్ల గోల్డ్ బార్) ఎలాంటి బిల్లులు, సుంకం చెల్లించకుండా అక్రమ రవాణా చేయడం ఒక ఎత్తు అయితే.. ఆభరణాలు తయారీ చేసి విక్రయించినప్పుడు బిల్లులు ఇవ్వకుండా చిత్తు కాగితాలపై రాసిస్తూ జీవో దందాకు పాల్పడటం ఇంకో ఎత్తు. తద్వారా జీఎస్టీ, ఆదాయ పన్ను చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. బంగారు వ్యాపారి ఒక ఏడాదిలో చేసే వ్యాపారంలో 30-40 శాతానికి మించి జీఎస్టీ లెక్కలు చూపడం లేదని ఓ వ్యాపారి పేర్కొనడం కొసమెరుపు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వానికి ఏడాదిలో రూ.15-20 కోట్లకు పైగా జీఎస్టీ రూపంలో ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో బంగారు క్రయ విక్రయాలపై ఒక శాతం జీఎస్టీ ఉంటే.. ప్రస్తుతం 3 శాతం జీఎస్టీ వసులు చేస్తున్నారు. జీఎస్టీ పెంచడం కూడా అక్రమ వ్యాపారానికి ఓ కారణమని వ్యాపారి ఒకరు పేర్కొన్నారు. అక్రమ రవాణాను, జీరో వ్యాపారాన్ని అరికట్టి ప్రభుత్వ ఖజానా రాబడి పెంచాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

మిగతా 6వ పేజీలో

నాణ్యత నగుబాటు


ఆలయం కింది భాగంలో కూలిన రక్షణ గోడ

- ఆలయ అభివృద్ధి పనుల్లో ఇష్టారాజ్యం
- రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న పనులు
- నిర్మాణ దశలోనే కూలిన రక్షణ గోడ
- ఆదాయం ఉన్నా అభివృద్ధికి నోచుకోని ప్రాచీన ఆలయం
- గడువు ముగిసినా నిర్వహించని వేలంపాటలు

నల్లమలలో కొలువై.. భక్తులచే విశేష పూజలందుకుంటున్న ప్రాచీన ఆలయం అభివృద్ధిలో వెనుకబడింది. ఘనమైన చరిత్ర కలిగిన పురాతన ఆలయం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రాభవం కోల్పోతోంది. నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలో ఆధ్యాత్మికతకు నిలయమైన సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఉంది. 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించారని చరిత్ర చెబుతున్న పురాతన సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. 2018లో కురిసిన వర్షాల ధాటికి ఆలయ ముందు భాగంలోని పురాతన రాతి కట్టడం, ప్రహరీ, ధ్వజస్తంభం కూలిపోయాయి. దీంతో టీటీడీ నిధులతో ప్రారంభించిన పనుల్లో నాణ్యత లోపించడంతో ఆలయ కింది భాగంలో నిర్మించిన రక్షణ గోడ కూలిపోయింది. ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఆలయం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిరివెళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) :

టీటీడీ నిధులతో పనులు

2018లో కురిసిన వర్షాలకు ఆలయ ముందు భాగంలోని రాతి కట్టడం, ధ్వజస్తంభం కూలిపోయాయి. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.20 లక్షల దేవదాయశాఖ నిధులతో 2020 వరకు ఫౌండేషన్ పనులు చేపట్టారు. ఆలయం కింద నుంచి పైభాగం వరకు దాదాపు 50 అడుగుల మేర నిర్మాణ పనులు చేపట్టాలంటే కోట్ల రూపాయలు అవసరమైనందున పనులు ముందుకు సాగలేదు. 2022లో కార్యనిర్వహణాధికారి, చైర్మన్, గ్రామ పెద్దలు సమస్యను అప్పటి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆలయ అభివృద్ధి కోసం నివేదికను తయారు చేయించి వివిధ పనుల నిమిత్తం రూ.1.6 కోట్ల టీటీడీ నిధులు మంజూరు చేయించారు. దీంతో 2022 జూన్ 4న పటిష్ట రక్షణ గోడ నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. నేటికి రెండున్నరేళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ముఖద్వారం




సర్వలక్ష్మీ నరసింహ స్వామి మూలవిరాట్

కూలిన ధ్వజస్తంభం.. నిలిచిన కల్యాణం

సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రతి నెలా స్వాతి నక్షత్రం, పౌర్ణమి రోజుల్లో స్వామి వారి ఉత్సవమూర్తులకు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేసేవారు. ఆలయ ముందుభాగంలో ఉన్న ధ్వజస్తంభం 2018లో కూలిపోవడంతో అప్పటి నుంచి నేటి వరకు స్వామి వారికి కల్యాణం నిర్వహించడం లేదు. అలాగే ఏడాదికి ఒకసారి వచ్చే నరసింహ స్వామి జయంతి రోజు సైతం కల్యాణం నిర్వహించకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు కొంగు బంగారమైన నారసింహుడి ఆలయంలో నిత్య పూజలు మాత్రమే జరుగుతుండడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర ముఖ ద్వార దర్శనం కలిగిన వైష్ణవ ఆలయం కావడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు సైతం కల్పించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆలయ ముందు భాగంలో నిలిచిన అభివృద్ధి పనులు

నాణ్యతకు తిలోదకాలు

రక్షణ గోడ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాల్విడంతో గోడ (సైడ్ వాల్) నిర్మించిన కొద్ది రోజుల్లోనే కూలిపోయింది. సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే గోడ కూలిపోయిందని తెలుస్తోంది. భక్తులు ఎవరూ లేని సమయంలో సైడ్‌వాల్ కూలడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. గోడ కూలి నెలలు గడుస్తున్నా నేటికీ కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆలయ ముందు భాగంలో మట్టిని నింపి చదును చేయాల్సి ఉండగా పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. నిధుల కొరతతో పనులు చేపట్టడం లేదా.. బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపేశారా అన్న ప్రశ్న తలెత్తుతోంది.


ప్రధాన రహదారిపై ఉన్న నారసింహుడి ఉపాలయం

ఆదాయం ఘనం .. అభివృద్ధి శూన్యం

సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి ఏడాదికి రూ.15 నుంచి రూ.18 లక్షల మేర ఆదాయం సమకూరుతోంది. మాన్యం భూములు, భక్తులు సమర్పించే హుండీ కానుకలు, తలనీలాలు, కొబ్బరి కాయలు, బొమ్మలు, చిత్రపటాలు, కూల్ డ్రింక్స్ విక్రయాలతోపాటు భక్తులు ఇచ్చే మిశ్రమ బియ్యం బహిరంగ వేలం పాటల ద్వారా ఈ ఆదాయం వస్తోంది. రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ ఆలయాన్ని ఏమాత్రం అభివృద్ధి చేశారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయం వద్ద భక్తులకు కనీస వసతులు కరువయ్యాయి. తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఆలయ అభివృద్ధి మరుగునపడింది. బహిరంగ వేలంపాట ద్వారా ఆలయానికి రావాల్సిన ఆదాయాన్ని సమకూర్చడంలో సంబంధిత అధికారి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలంపాట గడువు ముగిసి నెలలు గడుస్తున్నప్పటికీ వేలం నిర్వహించకపోవడంతో ఆలయ ఆదాయానికి గండి పడుతోంది.

పనులు ప్రారంభమవుతాయి

సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. ప్రహరీ కోసం గతంలో వేసిన ప్రణాళికను, డిజైన్‌ను టీటీడీ అధికారులు మార్చారు. అందుకు సంబంధించి ఎస్టిమేషన్ పూర్తవడంతో అనుమతులు సైతం మంజూరయ్యాయి. ఆలయ అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకుంటాం. పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. అలాగే బహిరంగ వేలంపాటను త్వరలోనే నిర్వహిస్తాం.

- బీవీ నరసయ్య, ఆలయ ఈవో

దొంగ బంగారం


2021లో పంచలింగాల చెక్‌పోస్టు వద్ద సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు

(5వ పేజీ తరువాయి)

ఆదోని అడ్డాగా బంగారు అక్రమ రవాణా!

ఆదోని పట్టణం వ్యాపార, వాణిజ్య రంగంలో రెండో ముంబాయిగా ప్రసిద్ధి చెందింది. అదే స్థాయిలో బంగారు అక్రమ రవాణా అడ్డాగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. కేరళ రాష్ట్రం ఎర్నాకులం పట్టణం నుంచి ఆదోనికి చెందిన 12 మంది బంగారు వ్యాపారులు 13 కిలోల బంగారం (విలువ రూ.10 కోట్లు పైమాటే) అక్రమంగా కన్యాకుమారి - పూణే ఎక్స్‌ప్రెస్ రైలులో రవాణా చేస్తుండగా సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ శాఖ సూపరింటెండెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది దాడులు చేసి స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. పట్టుబడిన వ్యాపారుల్లో పట్టణంలో ఓ ప్రముఖ బంగారు వ్యాపారి కుమారుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది జూలై మాసంలో చెన్నై నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా రెండు కిలోలు (విలువ రూ.1.50 కోట్లు పైమాటే) బంగారం సీజ్ చేసి.. ఆ తరువాత మామూళ్లు పుచ్చుకొని వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడి.. తరువాత రాజకీయ నేతల జోక్యం, వారి అండదండలతో కేసులు లేకుండా బయటపడిన సంఘటనలు ఉన్నాయి. ఆదోనిలో ఒక్కటే కాదు.. కర్నూలు, నంద్యాల పట్టణాల్లో కూడా బంగారు జీరో వ్యాపారం జోరుగా సాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

బంగారం అక్రమ రవాణా సంఘటనలు కొన్ని..

- 2017 సెప్టెంబరులో కర్నూలు నగర శివారులో అక్రమంగా తరలిస్తున్న దాదాపు 16 కిలోల బంగారు పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఇన్నోవా కారులో ఈ బంగారం తరలిస్తుండగా పట్టుబడింది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు తరిలిస్తున్నట్లు నాడు పోలీసులు గుర్తించారు.
- 2021 మార్చి నెలలో హైదరాబాద్ నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రికి అక్రమంగా 14.8 కిలోలు బంగారం రవాణా చేస్తుండగా కర్నూలు నగర శివారులో పంచలింగాల చెక్ పోస్టు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన రికార్డులు చూపకపోవడంతో బంగారు సీజ్ చేశారు.
- 2021లో కర్నూలు నగరంలోని ఓ బంగారు దుకాణంలో పని చేస్తున్న వ్యక్తి హైదరాబాదు నుంచి కర్నూలుకు ఓ ప్రైవేటు బస్సులో తీసుకొస్తుండగా పంచలింగాల చెక్ పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న అప్పటి సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య 1.818 కిలోల బంగారు సీజ్ చేశారు. విలువ రూ.1.80 కోట్లు ఉంటుందని అంచనా. ఎలాంటి బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు.
- 2021 జూన్ 24న మాసంలో బెంగళూరుకు చెందిన ఓ వ్యాపారి ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సులో 5 కిలోల బంగారం ఎలాంటి రికార్డులు లేకుండా రవాణా చేస్తున్నారు. పంచలింగాల చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసిన సెబ్ పోలీసులు సీజ్ చేశారు. బంగారు నగల వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు.
- అదే ఏడాది జూన్ 11న కర్నూలు నగర శివారులోని పంచలింగాల చెక్‌పోస్టు దగ్గర హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఓ కారును సెబ్ పోలీసులు తనిఖీ చేయగా.. 7 కిలోలు బంగారు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి బిల్లులు చూపకపోవడంతో సీజ్ చేశారు.
- 2024 ఫిబ్రవరి 2న కృష్ణగిరి మండలం అమకతాడు టోల్‌ప్లాజా వద్ద కర్నూలు స్పెషల్ బ్రాంచి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. హైదరాబాద్ నుంచి కోయంబత్తూరుకు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సులో అక్రమంగా రవాణా చేస్తున్న రూ.4.59 కోట్ల విలువైన బంగారు, వెండి సహా నగదు సీజ్ చేశారు. పట్టుబడిన వారిలో నంద్యాలకు చెందిన వ్యక్తి ఉన్నాడు.
- 2020 మార్చి నుంచి 2021 జూన్ వరకు పంచలింగాల చెక్‌పోస్టు అప్పటి సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య రెండేళ్లలో వాహన తనిఖీలు, దాడుల్లో బిల్లులు, ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమ రవాణా చేస్తున్న దాదాపు 26 కిలోలు బంగారం, 450 కిలోలకు పైగా వెండి సీజ్ చేసినట్లు పోలీసు రికార్డుల ద్వారా తెలుస్తుంది. తరువాత ఆ స్థాయిలో అక్రమ బంగారం, వెండి రవాణాపై తనిఖీలు, దాడులు, నిఘా కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి.

సంస్కృతిని ప్రతిబింబించే కళలను ఆదరించాలి


సినీ నటుడు, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న నృత్య గురువు కరీముల్లా

సినీ నటుడు, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి


వైకుంఠ ఏకాదశి సందర్భంగా 'సప్తగిరుల వైభవం' నృత్య రూపకంలోని కళాకారులు

కర్నూలు కల్చరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళలను ఆదరించాలని, ఆదిశగా కృషి చేస్తున్న నటరాజ నృత్య కళామందిరం సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని సినీ నటుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలులోని నటరాజ నృత్య కళామందిర్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు ఆరంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీవీ రెడ్డి మాట్లాడుతూ కళలకు ఆదరణ తగ్గుతున్న కాలంలో ఔత్సాహిక కళాకారులు వాటికి ప్రాణం పోస్తున్నారని, ఈ పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ అభినందనీయులేనని చెప్పారు. ఈ సందర్భంగా బీవీ రెడ్డి నిర్వాహకులకు రూ.10వేలు విరాళం ప్రకటించారు. మరో అతిథి రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ నృత్య కళాకారులకు ఇది ఒక మంచి అవకాశమని, ఈ పోటీల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రం ద్వారా ఔత్సాహిక కళాకారులకు శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నామని చెప్పారు. నటరాజ నృత్య కళామందిరం వ్యవస్థాపక నృత్య గురువు ఎస్ కరీముల్లా మాట్లాడుతూ తమ సంస్థ స్థాపించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా 'కళాసౌరభ 10 వార్షికోత్సవం-2025' పేరుతో ఈ నృత్య పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అలరించిన 'సప్తగిరుల వైభవం' నృత్య రూపకం...

జాతీయ స్థాయి నృత్య పోటీల్లో మొదటి కార్యక్రమంగా, వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రదర్శించిన 'సప్తగిరుల వైభవం' నృత్య రూపకం ఆసాంతం అలరింపజేసింది. శ్రీవేంకటేశ్వర స్వామి చరిత్రను తెలియజేసే ఈ నృత్య రూపకంలో సుమారు ముప్పయి మందికి పైగా కళాకారులు తమ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నాట్యాచార్యుడు ఎ.సంతోష్, నృత్య కళామందిర్ ప్రతినిధులు డాక్టర్ బీవీ స్వరూప్‌సిన్హా, కేపీఆర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు


ఆలయ ప్రాంగణంలో మంత్రి, ఎమ్మెల్యే, ఆలయ అధికారులు

శ్రీశైలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రకాశం జిల్లా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు ఆలయంలోని రత్నగర్భ గణపతి స్వామిని దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి అభిషేకం నిర్వహించుకున్నారు. తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని అర్చనలు జరిపించుకున్నారు. దర్శనానంతరం వీరికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించి, ప్రసాదాలు అందజేశారు.

మహానంది మోడల్ స్కూల్‌కు గ్రీన్ రేట్


ఎం.తిమ్మాపురంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల

మహానంది, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జాతీయ స్థాయిలో నేషనల్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నిర్వహించిన గ్రీన్ స్కూల్ కార్యక్రమం ఆడిట్‌లో మహానంది ఏపీ మోడల్ స్కూల్ గ్రీన్ రేట్ సాధించిందని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు శుక్రవారం తెలిపారు. మన రాష్ట్రం నుంచి 113 పాఠశాలలు జీఎస్పీ ఆడిట్ సబ్‌మిట్ చేయగా అందులో 16 పాఠశాలలు మాత్రమే గ్రీన్ రేట్ సాధించాయని తెలిపారు. నంద్యాల జిల్లా నుంచి మహానంది ఏపీ మోడల్ స్కూల్ మాత్రమే గ్రీన్‌రేట్ సాధించిందని తెలిపారు. పాఠశాలలో పర్యావరణానికి సంబంధించిన అంశాలకు గుర్తింపు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే నెల 4వ తేదీ ఢిల్లీలో జరిగే జాతీయ జీఎస్పీ కార్నివాల్‌లో గ్రీన్ సర్టిఫికెట్ అందజేస్తారని చెప్పారు. ఈ విజయానికి ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు విద్యార్థుల కృషి ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

మహానందిలో 'ముక్కోటి' పూజలు



లక్ష పుష్పాలంకరణలో కోదండరాముల పాలరాతి విగ్రహాలు

మహానంది, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం మహానందిలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకే ఆలయ అర్చకులు వనిపెంట జనార్దన్‌శర్మ, ప్రకాశం శర్మతో పాటు బెక్కెం శరభయ్యశర్మలు సీతారామచంద్ర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణ మండపంలో వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ప్రత్యేక పల్లకిలో ఉత్సవ మూర్తులను మేళ తాళాలతో ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చారు. ఏఈఓ ఎర్రమల్ల మధు దంపతులు ద్వారపూజ, తిరుప్పావై సేవల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఉత్తరద్వారం ద్వారా దర్శనం కల్పించారు. ఉదయం 10 గంటలకు కోదండరామాలయంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత్ శర్మ ఆధ్వర్యంలో మూడు గంటల పాటు పుష్పార్చన జరిపారు.



మహానందిలో కోదండరాముల ఊరేగింపు



మహానందిలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ప్రజా ప్రయోజనాలు కాపాడాలి

ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వామపక్షాల వినతి



ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఉపసంహరణ, సెకీ ఒప్పందం, సర్దుబాటు, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఏపీఈఆర్‌సీ భవన్‌లో నిర్వహించిన విద్యుత్ టారిఫ్ ప్రజా అభిప్రా య సేకరణ కార్యక్రమానికి నిరసనగా వెళ్లి ఆందోళన చేపట్టారు. విద్యుత్ టారిఫ్ పెంపు, స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని ఏపీఈఆర్‌సీ చైర్మన్, డిస్కంల సీఎండీల సమక్షంలో వామపక్షాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆదానీ లాభాలకు గ్యారెంటీ ఇవ్వడమే లక్ష్యంగా రాష్ట్రంలో అధికార పార్టీలు పని చేస్తున్నాయని విమర్శించారు. రూ.1750 కోట్ల లంచం తీసుకుని యూనిట్ రూ.2.49 కొనేందుకు గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే కూటమి ప్రభుత్వం ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు.

● పట్టణపౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు, అవినీతి ఒప్పందాలు రద్దు చేయాలని ఏపీఈఆర్‌సీ భవన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఇ.షఫుల్లారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాటపై నిలబడాలన్నారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

● విద్యుత్ చార్జీల పెంపుతో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ మూతపడే ప్రమాదం పొంచి ఉందని రైస్‌మిల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. రామచంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఏపీఈ ఆర్‌సీ భవన్‌లో చేపట్టిన ప్రజా అభిప్రాయ విచారణలో పాల్గొని విద్యుత్‌చార్జీలు పెంచడం వల్ల చిన్నతరహా పరిశ్రమలు కుదేలవు తున్నాయన్నారు.

● రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలపై కూటమి ప్రభుత్వం రూ.15432 వేల కోట్ల రూపాయల భారాన్ని మోపిందని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయ కులు మహేష్, శ్రీనివాసరావు, బీసన్న పాల్గొన్నారు.

● ఆదానితో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయా లని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం దిన్నెదేవరపాడు ఏపీఈఆర్‌సీ భవన్ ముందు విద్యుత్ చార్జీ పెంపును నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రం అదంజేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు.

● విద్యుత్ పెంపులో శాస్త్రీయత లోపించిందని డాక్టర్ జలీల్ అహమ్మద్ అన్నారు. శుక్రవారం ఏపీఈఆర్‌సీ భవన్‌లో చేపట్టిన ప్రజా అభిప్రాయ విచారణలో పాల్గొన్నారు.

జగన్‌ను ప్రజలు తరిమికొడతారు

● కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కర్నూలు అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుమల వైకుంఠ ద్వార దర్శనం కోసం టోకెన్ల తొక్కిసలాటలో మృతి చెందిన భక్తుల పట్ల జగన్ వ్యహరించిన తీరు బాధాకరమని, ఆయనను ప్రజలు రాష్ట్రం నుంచి తరిమికొడతారని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్, ఆయన చెంచాగాళ్లు భక్తుల పట్ల వ్యవహరించిన తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా చంద్రబాబు పట్ల జగన్ అనుచిత వ్యాఖ్యలు చూస్తుంటే ఆయనకు మతిస్థిమితం లేదని అర్థమవుతోందని అన్నారు. తిరుమలలో జరిగిన ఘటనపై జగన్, కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఇంగితం లేకుండా మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

అహోబిలం ఆలయ సిబ్బంది సస్పెన్షన్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 10(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పని చేస్తున్న ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు మేనేజర్ మురళీధరన్ తెలిపారు. కొంత మంది ఆలయ సిబ్బంది ఆలయ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో ఈ నెల 8న మద్యం తాగి మాంసం తింటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడతో ఆలయ నిర్వాహకులు విచారణ చేపట్టారు. ఆలయ నియమాలు పాటించకపోవడం, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు మేనేజర్ మురళీధరన్ వెల్లడించారు.

75 ఏళ్ల వేడుక

● 12న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు
● కలుసుకోనున్న పూర్వ విద్యార్థులు
● సిద్ధమైన ఎమ్మిగనూరు పాఠశాల, కళాశాల
● ఏర్పాట్లు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితో కలిసి ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

ఎమ్మిగనూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మరుసటి యేడాది ఏర్పాటైన పాఠశాల అది. ఆ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు 75 ఏళ్ల తర్వాత కలుసుకోనున్నారు. ఈ మహత్తర ఘట్టానికి ఈ నెల 12న ఆ పాఠశాల వేదికగా మారింది. ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను 1948వ సంవత్సరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇదే పాఠశాల ఆవరణలో 23.07.1969లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. ఈ ఉన్నత పాఠశాల, కళాశాలలో చదివిన వేలాది మంది విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. నేడు వారు పలు రంగాల్లో రాణిస్తున్నారు. మరికొందరు ఉన్నత పదవులు అలంకరించి పదవీ విరమణ పొందారు.

ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవిర్భవించి 77 వసంతాలు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైన 56 ఏళ్లు పూర్తయింది. దీంతో కళాశాల పూర్వ విద్యార్థులు ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే పాఠశాల, కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుల వివరాలను తెలుసుకొని కమిటీ సభ్యులు ఆహ్వానాలను పంపారు. అలాగే అందుబాటులో ఉన్న కొంతమందికి నేరుగా వెళ్లి ఆహ్వానం పలుకుతున్నారు. పాఠశాల, కళాశాలలో ఇప్పటి వరకు దాదాపు 50-60వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఈ విద్యార్థులంతా 75 ఏళ్ల తర్వాత ఈ నెల 12న జరిగే ప్లాటినం జూబ్లీ ఉత్సవాల రోజున కలుసుకొని అవకాశం ఉంది. ఇప్పటికే కమిటీ సభ్యులు ఏ మేరకు పూర్వ విద్యార్థులు హాజరవుతారో ఒక అంచనాకు వచ్చారు. ఇందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉన్నత స్థానాల్లో ఎంతో మంది

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కళాశాలలో చదువుకున్న వారిలో ఎంతో మంది పూర్వ విద్యార్థులు నేడు ప్రభుత్వ ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ముఖ్యంగా లోకాయుక్త జడ్జిగా నరసింహారెడ్డి, జిల్లా జడ్జిగా యు.యు. ప్రసాద్, ఆర్డీవో కేడర్‌లో పట్టణానికి చెందిన శారద భాగ్యరేఖ, వెంకటరెడ్డి, ఎర్రకోటకు చెందిన పీడీగా సిద్ధలింగమూర్తిలతోపాటు మరికొంతమంది ఉన్నత పదవుల్లో ఉండి ప్రజలకు సేవలందిస్తున్నారు. అలాగే ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఆకుల భరత్‌కుమార్ నాగర్‌కర్నూలు డీఎస్పీగా సేవలందిస్తుండగా, కలుగొట్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు నెల్లూరు డీఎస్పీగాను, గుడికల్లుకు చెందిన వెంకటేశ్వర్లు అనంతపురం డీఎస్పీగా పని చేస్తున్నారు. మరికొంత మంది పోలీసు అధికారులుగా ఉన్నారు. విద్యుత్ బోర్డు డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన పుల్లారెడ్డి, వ్యవసాయ శాఖ జేడీఏ గా రిటైర్డ్ అయిన వడ్డె నాగన్నతోపాటు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు గౌడప్పగౌడు, డాక్టర్ శ్రీనివాసులు, పారిశ్రామికవేత్త మాచాని రఘునాథ్, ఎమ్మార్ రమేష్, ఎమ్మార్ గంగాధర్‌లు ఈ విద్యాలయంలోనే విద్యనభ్యసించినవారే. అలాగే రాజకీయం గా వై.రుద్రగౌడు, పాలకుర్తి తిక్కారెడ్డి, ప్రముఖ న్యాయవాది లక్ష్మీనారాయణరెడ్డి, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, సోములగూడూరు పార్థసారథిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుమార్తె ఉమామహేశ్వరిలతోపాటు ఎంతో మంది రాజకీయ, ప్రభుత్వ రంగం, వ్యాపార, పారిశ్రామిక, పత్రిక రంగాలతో పాటు వామపక్ష పార్టీల్లో సైతం ఇక్కడ చదివిన విద్యార్థులు జిల్లా నుంచి రాష్ట్ర పదవులు అలంకరించారు.

ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు

ప్లాటినం జూబ్లీ వేడుకలు గుర్తుండిపోయేలా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాటు చేస్తున్నారు. కమిటీ సభ్యులు ఎం.సి శివకుమార్, మల్లికార్జున, హరినారాయణరెడ్డి, ప్రకాష్‌జైన్, కామలె గణేష్, ఈరన్నగౌడు, జబీర్‌బాషా, వెంకటేష్‌లతోపాటు పలువురు సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాల, కళాశాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో వేడుకలను నిర్వహించేందుకు ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేస్తున్నారు.

ఈ నెల 12న కార్యక్రమాలు ఇలా..

ఈనెల 12వ తేదీన ప్లాటీనం జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని శివ సర్కిల్ నుంచి సోమప్ప సర్కిల్ మీదుగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అలాగే ఉత్సవాల్లో మొదటగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘన సన్మానం చేయనున్నారు. ఉత్సవాలకు ఎమ్మిగనూరు ప్రాంతం నుండేగాక ఇక్కడ చదివి దేశ విదేశాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు దాదాపు 3 నుంచి 5వేల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉందని కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు.

అందరం కలుసుకోవడం ఎంతో అదృష్టం



ఎన్నో ఏళ్ల క్రితం మాకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకోవడం, నాతోపాటు చదివిన పాత మిత్రులను కలుసుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ అవకాశం అందరికి రాదు. నాతో పాటు కళాశాలలో చదివి ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. నేను మాత్రం ఇక్కడే ఉంటూ ఈ స్థాయికి ఎదిగి పలువురికి సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం వరంగా భావిస్తున్నా.

- మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, పూర్వ విద్యార్థి, సామాజికవేత్త

44 ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉంది



స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కళాశాలల్లో నేను చదువు పూర్తి చేసి 44 ఏళ్లయింది. తిరిగి ఇన్నేళ్ల తర్వాత మళ్లీ అప్పటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకునే అవకాశం మళ్లీ మాకు వచ్చింది. మాకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను కలుసుకొని వారి ఆశీర్వాదం పొందే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా.

- మామిడి మల్లికార్జున, పూర్వ విద్యార్థి, న్యాయవాది

ఏర్పాట్లు చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది



ప్లాటినం జూబ్లీ వేడుకలకు ఏర్పాట్లు చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్న. కమిటీ సభ్యులంతా వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ఐక్యంగా పర్యవేక్షిస్తూ విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. పూర్వ విద్యార్థులతా వేడుకల్లో పాల్గొని గత జ్ఞాపకాలను నెమరవేసుకొని విజయవంతం చేస్తారని ఆశిస్తున్న.

- షఫీఉల్లా, పూర్వ విద్యార్థి, ఎమ్మిగనూరు

మఠానికి అనుకూల తీర్పు

● నరహరి తీర్థుల ఆరాధన చేసుకోవచ్చన్న ధార్వాడ హైకోర్టు



రాఘవేంద్రస్వామి బృందావనం ముందు తీర్పు పత్రాలను ఉంచి పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మధ్వాచార్యుల శిష్యుడు నరహరితీర్థుల ఆరాధన, నిత్య పూజలు మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం చేసుకోవచ్చని కర్ణాటకలోని ధార్వాడ హైకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. దీంతో మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు గురువారం రాత్రి తీర్పు తీర్పు ప్రతులను రాఘవేంద్ర స్వామి మూలబృందావనం, ప్రహ్లాదరాయల ముందు వచ్చి పూజలు చేశారు. 1998లో రాఘవేంద్ర స్వామి మఠం నరహరితీర్థుల ఆరాధన చేయరాదని, ఉత్తరాది మఠానికి చెందిన వారికి స్టే ఆర్డర్ వచ్చింది. ఆ తీర్పును రెండో అప్పీల్ ద్వారా మంత్రాలయం మఠం కోర్టును ఆశ్రయించగా.. గురువారం రాఘవేంద్రస్వామి మఠం పూజలు చేసుకోవచ్చని అంగీకరిస్తూ గతంలో ఇచ్చిన స్టే ఆర్డర్‌ను ఎత్తివేసింది. ఇక నుంచి మంత్రాలయం మఠం ఆధ్వర్యంలో నరహరి తీర్థుల బృందావనానికి పూజలు, ఆరాధనోత్సవాలు, శుభకార్యాలు చేసుకోవచ్చని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, అనంతపురాణిక్, మేనేజర్-సీ ఈఈ సురేష్ కోనాపూర్‌లు సంబరాలు చేసుకున్నారు. 27 ఏళ్ల తర్వాత కర్ణాటకలోని హంపి సమీపంలో తుంగభద్ర నది మధ్యలో ఉన్న నరహరితీర్థుల బృందావనానికి మంత్రాలయం మఠం పూజలకు శ్రీకారం చుడుతుందని పీఠాధిపతి తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

డోన్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్వు గ్రామానికి చెందిన రైతు వడ్డె వెంకట నర్సు (30) చికిత్స పొందుతూ మృతి చెందాడు. తనకున్న రెండెకరాల్లో మూడేళ్లుగా వేసుకున్న పంటలో దిగుబడి లేక అప్పులు అధికమయ్యాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో ఈ నెల 4వ తేదీన పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం రైతు మృతి చెందాడని డోన్ రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.

కర్ణాటకలో సుళేకేరి మహిళ హత్య



కౌతాళం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుళేకేరి గ్రామానికి చెందిన మహిళ కర్ణాటకలోని మురవళి గ్రామ పొలాల్లో శుక్రవారం దారుణ హత్యకు గురైనది. వివరాలను పరిశీలిస్తే.. సుళేకేరి గ్రామానికి చెందిన కురువ బసమ్మ(52)కు ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన కురువ మారెప్పతో వివాహమైంది. వీరికి సంతానం కలగలేదు. భర్త మారెప్ప కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందాడు. బసమ్మ మూడేళ్లుగా పుట్టిన ఊరిలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నది. గురువారం ఉదయం కర్ణాటకలోని హచ్చొళ్ళిలో ఉచితంగా ఇచ్చే గ్యాస్ సిలిండర్ తెచ్చుకుంటానని గ్రామస్థులకు తెలిపింది. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం మురవళి గ్రామ పొలాల్లో హత్యకు గురైంది. పొలాల పనులకు వెళుతున్న కూలీలు విగత జీవిగా పడిన ఉన్న మహిళ శవాన్ని గుర్తించి స్థానిక హచ్చోళ్లి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేపట్టగా సాయంత్రం హత్యకు గురైన మహిళ కౌతాళం మండలం సుళేకేరి గ్రామానికి చెందిన కురువ బసమ్మగా గుర్తించారు. కర్ణాటక పోలీసులు స్థానిక కౌతాళం పోలీసుల సహకారంతో సుళేకేరి గ్రామానికి వచ్చి విచారించారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టు మార్టం కోసం సిరుగుప్ప ఆసుపత్రి తరలిస్తున్నట్లు తెలిపారు. హత్యకు గురైన మహిళను ఎవరు హత్య చేశారో, ఎందుకు చేశారో దర్యాప్తు చేసి కేసును త్వరలో ఛేదిస్తామని కర్ణాటక పోలీసులు తెలిపారు.

ఘనంగా మంత్రి టీజీ భరత్ కుమార్తె రిసెప్షన్

● హాజరైన ప్రముఖులు

కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, టీజీ శిల్పాభరత్ దంపతుల కుమార్తె శ్రీఆర్యపాణ్య, బొమ్మిడాల వెంకటశ్రీనశిన్ రిసెప్షన్ కార్యక్రమం నగరంలోని ఎస్‌ఏపీ క్యాంప్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, కర్నూలు ఎంపీ బస్తాపాటి నాగరాజు, ఈగస్ చీఫ్ ఆకే రవికృష్ణ, కలెక్టరు పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి, పల్లె సింధూరరెడ్డి, కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు, జడ్పీ సీఈఓ నాసరరెడ్డితో పాటు రాయలసీమ జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులు, టీజీవీ అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు భూపతిరాజు శ్రీనివాసవర్మ, సవితమ్మ

వైభవంగా వైకుంఠ ఏకాదశి

● ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి, అమ్మవార్లు ● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● అన్నదానం ఏర్పాటు చేసిన నిర్వాహకులు


ఆత్మకూరులో లక్ష ఒత్తుల దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు


10 బొల్లవరంలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న ఎంపీ శబరి


జూపాడుబంగ్లాలో..


దేవనూరులో పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు


గడివేముల: జిందాల్ పరిశ్రమలోని బాలాజీ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


వెంకటాపురంలో..


బండిఆత్మకూరులో జనార్దన స్వామికి పూజలు


ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు


గోస్పాడు: వేణుగోపాల స్వామికి పూజలు

నంద్యాల కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పురష్కరించుకొని పట్టణంలోని తెలుగుపేటలోని మద్దిలేటిస్వామి ఆలయం, పద్మావతి నగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో, గుడిపాటిగడ్డలోని లక్ష్మీవెంకటేశ్వ రాలయంలో ఈవో లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కార్యదర్శి దేవరశెట్టి శ్రీనివాస్, సభ్యులు పార్థసారధికృష్ణ, వంకదారి మధు పాల్గొన్నారు. బాలాజీ కాంప్లెక్స్ కళ్యాణ మండపంలో స్వామిని మొక్కజొన్న విత్తనాలతో అలంకరించారు. స్వామికి లక్ష తులసి అర్చన చేశారు. సంజీవనగర్ లక్ష్మీ వెంకటేశ్వరాల యంలో ఎన్ఎండీ ఫయాజ్, టీడీపీ కార్యకర్తలు దర్శనం చేసుకున్నారు. వీరికి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని భూవరాహ సహిత పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి ఉత్సవ క్రతువును వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు ప్రాతఃకాల సమయంలోనే పురోహితులు అభిషేకాలు, అర్చనలను శాస్త్రోక్తంగా చేపట్టారు. పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణతో భక్తులు ఉత్తర ద్వార దర్శనభాగ్యాన్ని కల్పించారు. లక్షవత్తుల దీపోత్సవంలో భాగంగా మహిళలు దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకుడు అనిల్‌కుమార్ వైకుంఠ ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాత్రి స్వామివారి లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అల్పాహార వితరణ చేపట్టారు. శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగాల శివరామిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లను ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, అర్బన్, రూరల్ సీఐలు డి.రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, నందికొట్కూరు విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాసులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భాగవతుల రఘురామాచార్యులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పెద్దలు శివరామిరెడ్డి వారిని స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆత్మకూరు రూరల్(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. దంపతుల ఆధ్వర్యంలో సుదర్శన హోమాన్ని వైభవంగా నిర్వహించారు.

బండిఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): మండంలోని వేంకటేశ్వర స్వామి, జనార్దనస్వామి, చెన్నకేశవస్వామి, శ్రీరామ, శ్రీకృష్ణ, ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఈవోలు నాగప్రసాద్, వేణునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆలయల్లోని మూల విరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు.

వెలుగోడు(ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో వైకుంఠ ఏకాదశిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెలుగోడులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

గోస్పాడు(ఆంధ్రజ్యోతి): మండలంలో వైకుంఠ ఏకాదశిని వైభవంగా నిర్వహించారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు(ఆంధ్రజ్యోతి): పాతముచ్చుమర్రి గ్రామంలోని జమ్ములమ్మ దేవి ఆలయంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి వైకుంఠ ఏకాదశి సందర్భంగా పూజలు నిర్వహించారు. ఆమె వెంట వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, బంగారు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు రూరల్(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో శుక్రవారం వేంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. గోవింద నామస్మరణతో దేవాలయాలు మార్మోగాయి. 10 బొల్లవరం గ్రామంలో వెలిసిన వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా వేంకటేశ్వర స్వామిని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఎంపీకి ఆలయ పురోహితులు పూర్ణకుంభంతో భాజాభజంత్రీలతో స్వాగతం పలికారు. ఆమె వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మిడుతూరు(ఆంధ్రజ్యోతి): దేవనూరు గ్రామంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి అలయంలో మక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకుడు నాగేంద్రుడు, తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

జూపాడుబంగ్లా(ఆంధ్రజ్యోతి): మండలంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. జూపాడుబంగ్లాలోని వేంకటేశ్వరస్వామి సమేత శ్రీదేవి, భూదేవి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామికి గణపతిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

పాములపాడు: స్థానిక బ్రహ్మంగారి ఆశ్రమ ఆవరణలోని లక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామికి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ పురోహితులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పాణ్యం(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం పాణ్యంలో భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. పాణ్యం వీరనారాయణ స్వామి ఆలయంలో, ఎస్ఆర్ బీసీ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గడివేముల(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ యాజమాన్యం నిర్మించిన బాలాజీ ఆలయంలో ఏకాదశి పురష్కరించుకొని శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు. అర్చకులు స్వామికి పుష్పాభిషేకాలు, పల్లకీ సేవ నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు జిందాల్ యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఎంపీ

పగిడ్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం పగిడ్యాల మండలం నెహ్రూనగర్ వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో శ్రీశైలం బ్యాక్ వాటర్ జలాశయంలోకి 21 లక్షల చేపపిల్లలను వదిలారు. ఉమ్మడి కర్నూలు జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మన్ బీఎస్ నవీన్‌కుమార్, మత్స్యశాఖ జేడీ రాఘవరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ శ్యామల, అసిస్టెంట్ డైరెక్టర్ సంధ్యారాణి, పగిడ్యాల ఎంపీడీవో సుమిత్రమ్మ, నెహ్రూనగర్ సర్పంచ్ కూరాకుల రాజే శ్వరి, టీడీపీ నాయకులు కటుబడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంట రుణ ప్రణాళిక సిద్ధం చేయండి: కలెక్టర్

నంద్యాల కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సర పంట వార్షిక రుణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులు, బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వ పథకాల రుణ ప్రణాళిక రూపకల్పనపై అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ఓఎఫ్ఆర్ భూముల రైతులకు, సూక్ష్మసేద్య పరిశ్రమలకు, మహిళా సాధికారత ఉపాధికి, విద్యారుణాలు, గృహరుణాలు, చేనేత రుణాలు, ప్రధానమంత్రి విశ్వకర్మయోజన తదితర ప్రాధాన్యత రంగాలకు లక్ష్యం మేరకు రుణాలను పెంచాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ జేడీఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'అబాకస్‌తో గణితం సులభతరం'

పాణ్యం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అబాకస్‌తో ద్వారా గణితం మరింత సులభతరమని ఎంఈవో కోటయ్య తెలిపారు. శుక్రవారం కేఆర్ఆర్ పాఠశాలలో వేదిక్ మాథ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అబా కస్ పోటీలను నిర్వహించారు. వేదిక్ మ్యాథ్స్ జోనల్ మేనేజరు శివాంజనేయులు మాట్లాడుతూ జిల్లా నుంచి 35 పాఠశాలల నుంచి 550 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. విజేతలకు విజయవాడలో ఫిబ్రవరి 9 వతేదీన రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. కరస్పాండెంట్ వాసుదేవరెడ్డి, నరేష్, దస్తగిరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలి'

ఆత్మకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందాలను వెంటనే అమలు చేయడంతో పాటు ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పెద్ద నాగరాజు, తిమ్మయ్య, రాజు, ప్రసాద్ సువర్ణమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘాల నాయకులు జయన్న, బాలరాజు, నాగన్న, సురేష్, సుగుణమ్మ, మరియమ్మ, జీవరత్నమ్మ ఉన్నారు.

నందికొట్కూరు(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సమ్మెకాలపు హామీలను వెంటనే అమలు చేయాలని సి.ఐటియూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరమేష్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రీశైలం మండల అధ్యక్షుడిగా శ్రీను


శ్రీనుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

శ్రీశైలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మండల బీజేపీ మండల అధ్యక్షుడిగా చదువుల శ్రీను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శుక్రవారం సుండిపెంటలోని రెడ్ల కల్యాణమండపంలో జరిగిన బీజేపీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడిగా చదువుల శ్రీనును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధినాయకత్వం తనకు మండలాధ్యక్ష బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరికి, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

గోకులం షెడ్ల ప్రారంభం

నందికొట్కూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రాయితీపై రైతులు నిర్మించుకున్న మూడు గోకులం షెడ్లను ఎంపీ బైరెడ్డి శబరి శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకతో రైతులకు మంచి రోజులు వచ్చాయన్నారు. టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, సివిల్ సప్లైస్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, బంగారు వెంకటేశ్వర్లు, ముచ్చుమర్రి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

బండిఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని 7 గ్రామాల్లో 7 షెడ్లను ఎంపీడీవో దస్తగిరి, ఏపీవో వసుధ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మినీ గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుగంగ ప్రాజెక్టు వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, టీడీపీ అధ్యక్షుడు మండల నరసింహారెడ్డి సూచించారు. సర్పంచ్‌లు పుష్పాంజలి, సరిత, నాగమణి, శీను, లింగారెడ్డి, శంకర్, అంబ్రోస్, కృష్ణారెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.

మహానంది(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల కోసం కూటమి ప్రభుత్వం మినీ గోకులం షెడ్లను ఏర్పాటు చేసిందని కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి తెలిపారు. ఉల్లిగడ్డల బొల్లవరం, ఎం. తిమ్మాపురం గ్రామాల్లో ఉపాధిహామీ పథకం, పశుసంవర్థక శాఖ సమన్వయంతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను ఎంపీడీవో మహమ్మద్ దౌలా ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధుల చేత ప్రారంభించారు. ఎంపీపీ యశస్విని, జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతి కుమార్ యాదవ్, మండల టీడీపీ కన్వీనర్ నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, యు.బొల్లవరం టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు మధు, ఏపీవో మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాములపాడు(ఆంధ్రజ్యోతి): మద్దూరు, రుద్రవరం గ్రామాల్లో గోకులం షెడ్లను ఎంపీపీ సరోజినీ వర్గీసియా, ఎంపీడీవో చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి ప్రారంభించారు. ఏపీవో విమలమ్మ, జేఈ రమేశ్‌నాయుడు, నాయకులు నసురుల్ల, నారాయణ, నరసింహ, అలీ, పెద్ద వెంకటరెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


ముచ్చుమర్రిలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ శబరి

ఆత్మకూరు రూరల్(ఆంధ్రజ్యోతి): మండంలోని పాడి రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం మిని గోకులం షెడ్లను మంజూరు చేస్తోందని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. వడ్లరామాపురం, బాపనంతాపురం గ్రామాల్లో గోకులం షెడ్లను ప్రారంభించారు. సర్పంచ్ దరగయ్య, ఏపీవో నాగమ్మ, పశువైద్యాధికారి అరుణ, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, ప్రసాద్, టీడీపీ నాయకులు శ్రీరామ్‌రెడ్డి, లింగస్వామి, సుబ్బయ్య, వెంకటరమణ, మధు, రాజగోపాల్, బాబు రావు, శంకర్, శివప్రసాద్‌రావు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్(ఆంధ్రజ్యోతి): పాండురంగాపురం, మిట్నాల, పుసులూరు, పోలూరు, కానాల గ్రామాల్లో గోకులాల ప్రారంభోత్సవాన్ని ఎంపీడీవో సుగుణశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మిట్నాల సాగునీటి సంఘ అధ్యక్షుడు రవిబాబు, ఏపీవో శ్రీకళ, ఈసీ సలావుద్దీన్, కానాల టీడీపీ నాయకులు హనీఫ్, లాయర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీ2 సెక్షన్ ఏఈ రామయ్య తెలిపారు. శుక్రవారం అయన మాట్లాడుతూ రెండో శనివారం సందర్భంగా డీ2 సెక్షన్ పరిధిలో ఎన్‌జీవోస్ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, పద్మావతినగర్, వీసీ కాలనీ, గిరినాథ్ సెంటర్, టీచర్స్ కాలనీ, నూనెపల్లి తదితర ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగాదారులు సహకరించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా దేవదానం



పాణ్యం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గోనవరం గ్రామానికి చెందిన పిడతల దేవదానం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. దేవదానం ఎంపికపై ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

'సద్వినియోగం చేసుకోవాలి'

ఆత్మకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరులో మూడు కంపెనీల ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. మొత్తం 45 మంది అభ్యర్థులు రాగా వారిలో 18 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మావతీబాయి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

నంద్యాల రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, లేకపోతే మంత్రి ఇంటిని ముట్టడిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు హెచ్చరించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని నిరు పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుల ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టణంలో రెండుసెంట్లు, గ్రామాలలో మూడుసెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణాలకు ఐదు లక్షల రుణాలు ఇవ్వాలన్నారు. పేదలు ఇంటి స్థలాలు ఇవ్వకుంటే జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీటీ రామసంజీవరావుకు వినతి పత్రం అందజేశారు. పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ శాఖ కార్యదర్శి సహాయకార్యదర్శి హబీబ్‌బేగ్, షేక్షావలి, మద్దిలేటి, మద్దయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి తక్షణమే ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు నాగరాజు, టి.ప్రతాప్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయ అడ్మిన్‌స్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అహ్మద్‌హుసేన్, లల్లు, షేక్షా, మాబాషా, పుల్లయ్య ముర్తుజాబీ, స్వాతి, పుల్లమ్మ, లక్ష్మీబాయి తదితరులు ఉన్నారు.

మహానంది(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వెంటనే ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. తెలిపారు. మహానందిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ్, మండల కార్యదర్శి సామేల్, నాయకులు పాల్గొన్నారు.



నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

గోస్పాడు(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు సూర్యప్రతాప్, మండల కార్యదర్శి హరినాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట సమావేశం నిర్వహించి డీటీ హరితకు వినతి పత్రం అందజేశారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, నరసింహులు, మౌలాలి పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో అర్ధరాత్రి నుంచి శుక్రవారం వేకువజాము వరకు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆకస్మిక పర్యటన చేశారు. జిల్లా కేంద్రంతో పాటు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ లోని వివిధ ప్రాంతాల్లో వైకుంఠ ఏకాదశి, కొత్త సినిమాల విడుదల నేప థ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అహోబిళం లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నంద్యాల క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోకుల్ దాల్ మిల్లులోని పల్వరైజర్ మిషన్‌లో పడి తీవ్రంగా గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. చాపిరేవుల గ్రామానికి చెందిన రాజేశ్వరి అనే మహిళ దాల్ మిల్లులో పనిచేస్తూ గురువారం పల్వరైజర్ మిషన్‌లో పడి తీవ్రంగా గాయపడ్డారు. మహిళను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించిం దని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'సమస్యలపై పోరాటం'


మల్లికార్జునను అభినందిస్తున్న నాయకులు

నందికొట్కూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాయి బ్రాహ్మణుల సమస్యలపై పోరాడతామని చేస్తామని ఏపీ నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్కాపురం కనకారావు అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో నాయిబ్రాహ్మణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నందికొట్కూరు పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం సభ్యుడు పెరిమళ్ల మల్లికార్జునను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య, వర్కింగ్ పెసిడెంట్ భాను ప్రసాద్, క్షవర వృత్తిదారుల కన్వీనర్ రాయవరపు గణపతి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం


లైబ్రరీని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ

పాణ్యం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జేఎన్‌టీయూఏ వీసీ డాక్టర్ హెచ్. సుదర్శనరావు డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. డేటా సైన్స్ ల్యాబ్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ తదితర ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆర్జీఎం విద్యాసంస్థల అధినేత డాక్టర్ మిద్దె శాంతిరాముడు, ఎండీ మిద్దె శివరాం, శాంతిరాం వైద్యశాల ఎండీ ఎం.రఘురాం, డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, హెచ్‌వోడీ డాక్టర్ కిషోర్ కుమార్, రవిశేఖర్, వెంకటేశ్వరరెడ్డి, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గణ మద్దిలేటి స్వామి కల్యాణం



రంగాపురంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

బేతంచెర్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున మద్దిలేటి స్వామికి చందనాలంకరణ సేవ, విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అనంతరం 10 గంటలకు ఉత్సవమూర్తుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆర్‌ఎస్ రంగాపురంలో రథోత్సవాన్ని, చెక్కభజన, కోలాటాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రమేష్‌బాబు పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో కోట్ల రామవేంద్రరెడ్డి దంపతులకు ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు, మాజీ చైర్మన్ ఎల్ల నాగయ్య, ఆలయ వేద పండితులు అర్చకులు తీర్థప్రసాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పాలుట్ల రంగనాథస్వామి కల్యాణోత్సవం..

బేతంచెర్ల: మండలలోని గూటుపల్లె గ్రామ సమీపంలో ప్రకృతి కొండల నడుమ వెలసిన శ్రీదేవి భూదేవి సమేత పాలుట్ల రంగనాథ స్వామి కల్యాణోత్సవం ఆలయ ప్రధాన అర్చకుడు విష్ణువర్ధన్ ఆచార్యులు, వేద పండితులు నరేష్ శర్మ వేదమంత్రోచ్ఛరణాల మధ్య వైభవంగా శుక్రవారం నిర్వహించారు. మండపానికి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణం జరిపించారు. సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ



డోన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

డోన్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో కార్యకర్తలు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు మోటరాముడు, నారాయణ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పేదలకు ఇంటి స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో పేదలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు, హమాలీ, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డోన్‌లో మినీ జాబ్ మేళా

డోన్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మినీ జాబ్ మేళాలో జిల్లా ఉపాధి కల్పన అధికారి సోము శివారెడ్డి, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి, మినీ జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులకు సలహాలు సూచనలు చేశారు. ఈ మినీ జాబ్ మేళాలలో మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 34 మంది అభ్యర్థులు హాజరు కాగా, 15 మంది ఎంపికయ్యారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. డీపీఈవో రవికుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం చాగలమర్రిలోని మూడు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దుకాణదారులు స్టాక్ రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. బెల్ట్‌షాపులపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ రూఫ్సింగ్, ఓబులేసు ఉన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

డోన్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి, డీఎస్పీ పి.శ్రీనివాసులు, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యాయులు న్యాయాధికారి తంగమణి, డీఎస్పీ శ్రీనివాసులకు పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకి సేవ

బనగానపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం శ్రీచౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకీ సేవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

ఆట పాటలతో విద్యా బోధన

దొర్నిపాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆట పాటలతో విద్యా బోధన చేస్తున్నట్లు సీడీపీవో తేజశ్విని అన్నారు. శుక్రవారం కొండాపురం, చాకరాజువేముల, అమ్మిరెడ్డినగర్, క్రిష్టిపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలి

శిరివెళ్ల, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కళాశాలస్థాయి నుంచే వ్యాపార నిర్వహణ సామర్థ్యాలు మెరుగుపరుచుకోవాలని యర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ ఇంద్రావతి, శ్రీనివాసులు అన్నారు. ఎంటర్‌ప్రెన్యూవర్‌షిప్ సెల్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులు వివిధ వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులు హఫ్స, ఆయేషా, సునీల్‌కు ప్రిన్సిపాల్ ఇంద్రావతి బహుమతులు పంపిణీ చేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కుమారి, విజయరేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎం థియేటర్‌ను మూసివేసిన అధికారులు

బనగానపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని జీఎం థియేటర్‌ను జాయింట్ కలెక్టర్, లైసెన్సు అథారిటీ వారి ఉత్తర్వుల మేరకు మూసివేసినట్లు తహసీల్దారు నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. జీఎం థియేటర్ లైసెన్సు గడువు ముగిసినా రెన్యువల్ ఫీజులు చెల్లించకపోవడంతో మూసివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డోన్ ఆర్డీవో నరసింహులు, బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి పాల్గొన్నారు.



మూడురాళ్లపల్లెలో వెంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న మహిళలు



రుద్రవరం మండలం వాసాపురంలో కల్యాణ ఉత్సవమూర్తులు



ఉయ్యాలవాడ మండలం ఇంజేడులో స్వామివారి మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు



కొలిమిగుండ్ల బెలుంలో పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

- భక్తజనంతో కిటకిటలాడిన ఆలయాలు
- ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనం
- ప్రముఖుల ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 10(ఆంధ్రజ్యోతి) : భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. అహోబిలం నృసింహస్వామి క్షేత్రంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎగువ, దిగువ అహోబిలంలో స్వామి, అమ్మవార్లను ఎమ్మెల్యే ఉత్తరముఖ ద్వారం ద్వారా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు.



అహోబిలంలో హారతి స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



అవులదొడ్డి లక్ష్మి వెంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న కోట్ల రాఘవేంద్రరెడ్డి దంపతులు

చాగలమర్రి: మండలంలోని మద్దూరులో ఉత్తర ద్వార దర్శనం గల ప్రసన్న వేంకటేశ్వరస్వామికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు కిషోర్‌శర్మ, సాయిశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ, అయ్యప్ప, సాయినాథ, మూడురాళ్లపల్లె గ్రామంలోని ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం : వాసాపురం గ్రామంలోని వేంకటేశ్వరుడి ఆలయంలో, దొర్వి నరసింహస్వామి, రుద్రవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో, సంతానవేణుగోపాలస్వామి, సత్యనారాయణస్వామి ఆలయాల్లో ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

వేంకటేశ్వరస్వామి కళ్యాణం కమనీయం

మండలంలోని వాసాపురం గ్రామంలో లక్ష్మిగోదాదేవి అమ్మవారు వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం కనులపండువగా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణం తిలకించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

ఉయ్యాలవాడ: ఇంజేడు గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వారం గుండా దర్శనమిచ్చారు. ఆర్.జంబులదిన్నెలో అర్చకుడు కీర్తి లక్ష్మణస్వామి అభయ ఆంజనేయ, శ్రీరామచంద్ర మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు, ఉయ్యాలవాడలో బలిజ సంఘం నాయకులు శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే ఇంజేడు గ్రామంలో శ్రీనివాస కల్యాణం కమనీయంగా సాగింది. ప్రధాన అర్చకులు రమణయ్య, అనంతయ్య ఆధ్వర్యంలో మేళ తాళాల మధ్య స్వామి, అమ్మవార్ల వివాహం ఘనంగా జరిపించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల, కల్వటాల, కోటపాడు, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, చింతలాయపల్లె తదితర గ్రామాల్లోని చెన్నకేశవస్వామి, రామాలయాలు, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలో విశేష పూజలు, భజనలు, అన్నదానం తదితర కార్యక్రమాలు చేపట్టారు. బెలుం గ్రామంలో శ్రీకృష్ణ మందిరం, రామాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు ఆలూరు రాఘవేంద్రప్రసాద్, మహేశ్ శర్మ అన్నారు.

కోవెలకుంట్ల : పట్టణంలోని పాండురంగ స్వామి దేవాలయం, అష్టలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తరద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు.

డోన్ రూరల్: మండలంలోని ఆవులదొడ్డి గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకల్లో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజు, నాయకులు సీలం భాస్కర్ నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడులకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశించి స్వామివారికి పూజలు నిర్వహించారు. అలాగే ఆంజనేయ, సాయిబాబా ఆలయాల్లో కూడ ఏకాదశి వేడుకలను నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈవో చంద్రుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వారం గుండా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

అవుకు : అవుకు పట్టణంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి, మద్దిలేటి స్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. చల్లా విఘ్నేశ్వరరెడ్డి చెన్నకేశవస్వామి ఆలయానికి చేరుకొని స్వాముల వారికి పూజలు చేసి వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం భూలక్ష్మి సమేత చెన్నకేశస్వామి గరుడవాహనంపై పల్లకీలో ఊరేగారు. మద్దిలేటిస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని పేరుసోమలలో వెలి సిన చెన్నకేశవస్వామి, సంజామల వనం వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయాన్నే భక్తులు ఆలయానికి చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గుళ్లదుర్తి భగవద్గీత పారాయణ సంఘం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను ప్రధాన క్రిష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు అందజేశారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పూజలు



పూజల్లో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు

బనగానపల్లె: పట్టణంలోని కొండపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. స్వామివారికి రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. ఉత్తరముఖ ద్వారం ద్వారా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. వేలాదిమంది భక్తులు బనగానపల్లె పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమంలో టంగుటూరు శ్రీనయ్య, మల్లారెడ్డి, కూరగాయలశేఖర్, మురళీమోహన్‌రెడ్డి, టీచర్ నాగరాజు, బచ్చు భాస్కర్, పవన్ కుమార్‌రెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చాకరాజువేములలో చెన్నకేశవస్వామి ఆలయంలో ..



ప్యాపిలి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సంజామలలో స్వామివారి అలంకరణ



అవుకులో మద్దిలేటిస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మౌలిక వసతులపై దృష్టి పెట్టాలి: మంత్రి బీసీ

బనగానపల్లె, జనవరి 10(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలో మౌలిక వసతులపై అధికారులు దృష్టి పెట్టాలని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో పారిశుధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలపై మంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డ్వామా పీడీ జనార్దన్‌రావు, డీఎల్‌డీవో నరసింహారెడ్డి, ఎంపీడీవో రమణ, ఈవో ఆర్‌డీ సతీశ్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బంది, గ్రామ వార్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల తనిఖీ

బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్యసేవల వివరాలు గురించి డాక్టర్లతో స్వయంగా చర్చించారు. ఆస్పత్రిలో అవసరమైన మందులు, పరికరాలను మెడికల్ కిట్‌లను అందుబాటులో ఉంచుకోవాలని డాక్టర్లకు మంత్రి సూచించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, ఆస్పత్రి వైద్యులతో పాటు ఆస్పత్రి కమిటీ సభ్యుడు నియాజ్‌హుసేన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బాలుర సంక్షేమ వసతి గృహం పరిశీలన

బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, గురుకుల పాఠశాలలను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం స్వయంగా పరిశీలించారు. హాస్టల్, పాఠశాల అపరిశుభ్రంగా ఉండడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వెంట గురుకుల పాఠశాల సిబ్బంది, హాస్టల్ వార్డెన్ నాగేంద్ర, సర్వేయర్ పాల్గొన్నారు. అలాగే క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రజల నుంచి సమస్యలతో కూడిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

చాగలమర్రి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో కుష్ఠువ్యాధి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని వైద్యులు ఇమ్రాన్ సూచించా రు. శుక్రవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడు తూ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, మేయిల్ వలంటీర్లు కలిసి ఇంటిం టికి వెళ్లి కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి వైద్యశాలలో ప్రత్యేక చికిత్సలతో పాటు మందు లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఏవోగా బీఎల్ భరణీకుమారి

కోవెలకుంట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా బీఎల్ భరణీకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల పీఆర్‌ఐ డివిజను కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తూ ఏవోగా పదోన్నతిపై ఎంపీడీవో కార్యాలయానికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు

కోవెలకుంట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే మంచి గుర్తింపు ఉంటుందని కోవెలకుంట్ల ఆర్టీసీడిపో మేనేజరు తిరుపతయ్య అన్నారు. శుక్రవారం కండక్టరు కె.నరసింహులును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ నరసింహులు అక్టోబరులో 47.52 ఈపీకే, నవంబ రులో 49.30 ఈపీకే, డిసెంబరులో 45.22 ఈపీకే సాధించి అవార్డులు పొందడం సంతోషకరమన్నారు. మిగిలిన వారు నరసింహులును ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు.

వేదిక్ గణితంలో ప్రతిభ చాటిన విద్యార్థులు

చాగలమర్రి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జోనల్ స్థాయిలో జరిగిన వేదిక్ గణిత ప్రతిభా పోటీలలో చాగలమర్రి అజిమ్ బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న యశశ్విని, సోహెల్ ప్రతిభ కనబరిచారు. వీరికి ఎంఈవో కోటయ్య ప్రశంసా పత్రాన్ని, మెమోంటోను అందజేశారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, హెచ్‌ఎం గౌస్‌లాజం, ఉపాధ్యాయులు, వేదిక్‌గణితం బోధించిన సతీష్‌కుమార్‌ను అభినందించారు.

వైభవంగా చెన్నకేశవ పల్లకి సేవ

చాగలమర్రి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులకు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

రేపు ఆళ్లగడ్డలో ముగ్గుల పోటీలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతిని పురస్కరించుకొని పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు, గాలిపటం ఎగురవేయు పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే గాలిపటం ఎగురవేయడంలో ప్రతిభచూపిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతుల అందజేయనున్నట్లు వెల్లడించారు.

కార్యకర్తల ఆప్యాయత వెలకట్టలేనిది



అభిమానుల సమక్షంలో కేకు కట్ చేస్తున్న మూలే రామేశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకులు, కార్యకర్తలు తన పట్ల చూపుతున్న అభిమానం, ఆప్యాయత వెలకట్టలేనిదని టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మూలే పుట్టినరోజు సందర్భంగా టీడీపీ కార్యాలయంలో నాయకులు గూలి నాగేశ్వరరెడ్డి, నిమ్మకాయల దస్తగిరి, బొట్టుస్వామి, మధుసూదనరెడ్డి ఏర్పాటు చేసిన కేకును ఆయన కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడూరు శివరామిరెడ్డి, ఉపసర్పంచ్ పెద్ద నాగయ్య, గూడూరు మహేశ్వరరెడ్డి, చంద్రమోహన్‌యాదవ్, బోయ రవి, చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

చాగలమర్రి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వాసవీ ఎయిడెడ్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి వెంకటవసంత్ ఉమ్మడి జిల్లా అండర్-19 బేస్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. శుక్రవారం విద్యార్థి వెంకటవసంత్‌కు ప్రోత్సాహక బహుమతి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణగుప్త, కార్యదర్శి సాగర్, శివప్రసాద్, పుల్లారెడ్డి, అధ్యాపకులు శివరామిరెడ్డి, రామకృష్ణభగవాన్ పాల్గొన్నారు.